# దేవుడు నవ్వాడు

"అమ్మా...ఓమ్మా....అన్నయ్య ఫస్టు క్లాసులో పాస్ అయ్యాడట"

ఏడుకొండలు రెండో కొడుకు పరిగెత్తుకుంటూ వస్తు రెండుసార్లు పడబోయి ఆపుకుని వచ్చి మరీ చెప్పాడు. చిరిగిన చీరెకి మాసికలు వేసుకుంటూన్న ఏడుకొండలు భార్య వీరమ్మ చేతిలో సూదిని అలాగే పట్టుకుని అంది.

"నిజమేనట్రా చిన్నోడా!"

నిజమమ్మా. ధర్మయ్య పంతులుగారు చెప్పారు ! పేపరులో చూసి మరీ చెప్పారు!"

ఆయాసంతో వగురుస్తూ అన్నాడు. వీరమ్మ ముఖం చాటంత అయింది.

"ఏడుకొండలవాడా మమ్మల్ని గట్టెక్కించావా బాబూ" మనసులోనే దేవుడికి దణ్ణాలు పెట్టుకుంటోంది.

"అమ్మా పంతులుగారొచ్చారు." అరవైయేళ్ళ ధర్మయ్య మాష్టారు ఎండలో ఆయాసపడిపోతూనే నడిచి వచ్చారు. "చెల్లెమ్మా మన జగన్నాధం ఫష్టుక్లాస్ తెచ్చుకున్నాడు." వీరమ్మ చిన్నకొడుకు చిన్నా కుర్చీపీట తెచ్చి వేస్తే దానిమీద కూర్చుంటూ అన్నారు.

ఇదంతా మీ చలవేగా పంతులుగారూ. చిన్నా కాసిన్ని మంచి నీళ్ళలో మజ్జిగవేసి పట్రాబాబూ"

చిన్నా లోపలికి పరుగెత్తాడు.

"అదేమిటమ్మా నా చలవయేంటీ. నే చదివానా? రాశానా."

అలా అనకండి. మా పెద్దాడికి మొదట మీరు వేసిన పునాదేగా."

అది చిన్నప్పటిమాట. పెద్దక్లాసుల్లోకి వెళ్ళిన తర్వాత చదవల్సింది వాళ్ళేగా."

అమ్మా నన్ను కాలేజీలో చదివిస్తారా" చిన్న చూస్తూ అడిగాడు తల్లిని.

"ఇంక ఈ యింటిభారం అంతా అన్నయ్యదేరా, వాడినే అడుగు".

చిన్నా మురిసి పోతున్నాడు ఈ మాటలకి. ఏడుకొండలు పేపరులో పరీక్ష ఫలితాలు వచ్చాయనే వార్తవిని సోడా సీసాలు అమ్మటం ఆపి బండి తోసుకుంటూ యింటికి వచ్చేశాడు. ఏడుకొండలు సోడాసీసాలు అమ్ముతాడు. కోతలకీ వూడుపులకి పదిహేనేళ్ళ కూతురినీ, పదో తరగతి చదివే చిన్న కొడుకుని కూలికి తీసుకుని వస్తాడు. ఇంక వీరమ్మ మిషను మీద బట్టలు కుట్టి భర్త సంపాదనకి వేడినీళ్ళకి చన్నీళ్ళుతోడు అన్నట్లుగా సాయపడుతుంది కాపరానికి వచ్చినదగ్గరనించీ. ఏడు కొండలికి తన చిన్నప్పుడు చదువుకోవాలని చాలా యిష్టంగా వుండేది. అయితే ఆరోజుల్లో ఈ వూళ్ళో హైస్కూలు యెక్కడిది. బస్తీలో చదివించే శక్తి తండ్రికి లేదు. తనతోటి వాళ్ళందరూ పై చదువులు చదివి పెద్ద ఉద్యోగాల్లోకి వెళ్ళిపోయారు. కరణంగారి కొడుకూ తనూ అయిదో క్లాసువరకూ ప్రాణ స్నేహితులే అయినా ఆ తర్వాత అతను చదువుకుని యిప్పుడు చాలా పెద్ద ఉద్యోగం చేస్తూన్నాడు.

భార్యా పిల్లలతో అప్పుడప్పుడూ స్వంత వూరికి వస్తూంటాడు. వచ్చినప్పుడల్లా తనకి కబురంపుతాడు. మంచీ, చెడ్డా అడుగుతాడు. యిలాంటప్పుడు ఏడుకొండలకి ఏనుగెక్కినంత సంబరంగా వుంటుంది. ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా చిన్నప్పటి స్నేహితం మరువనందుకు ఓసారి అన్నాడు.

"ఏడుకొండలూ నీ పెద్దకొడుకుని నిన్న చూశాను. చాలా తెలివైన వాడు. చూడు వాడినైనా చదివించు. డిగ్రీ పూర్తిచేయించు యెంతకష్టమైనా."

"మాకెందుకండీ, కడుపు కట్టుకుని చదివించినా ఉద్యోగాలు తెచ్చుకోలేంగా"

"అలా అనకు. నువ్వు చదువు పూర్తిచ్చేయించి నాకు ఉత్తరం రాయి అంటూ ఆడ్రెస్ ఇచ్చాడు. ఈ మాట ఆయనకి గుర్తు వుందో ఏదో గానీ ఏడుకొండలకి బాగా గుర్తుఫుండిపోయింది. అందుకే కొడుకుని కాలేజీలో యెంతో కష్టంమీద చేర్పించాడు. కాని ఆ చదువు పూర్తిచేయించటానికి చాలా అవస్థలు పడ్డాడు యిలాంటప్పుడు భార్య సణిగేది.

తోటివాళ్ళు తొడ కోసుకున్నారని, మనం మెడ కోసుకున్నట్లుందీ పని, అసలు మనం యెంత? మన బతుకు లెంత? అయినా మనకెందు కొచ్చిన చదువులూ అంట!"

ఏడుకొండలు భార్యమీద ఎగిరి పడ్డాడు.

"చూడూ మానాన్న నన్ను నిరవాకం చేశాడుగా చాలు. ఇన్న అంతా సోడా సీసాలు అమ్ముకున్నా కడుపునిండటానికి కటకటగా వుంది. నాలాగా నా కొడుకూ ఎండలో వానలో సోడాబండి తిప్పుకు బ్రత కూడదు. నా కొడుకు కోసం నేనెంత కష్టపడ్డా ఫరవాలేదే. కానీ వాడు చదివి వుద్యోగం చెయ్యాలి పెద్ద జీతం తెచ్చుకోవాలి. తమ్ముడిని వాడే చదివించాలి, చెల్లెలి పెళ్ళి వాడే చెయ్యాలి. చేస్తాడు కూడా. చూడూ మనం గంజితాగి అయినా వాడిని పైకి తెస్తే రేపు ఈ కాపరాన్నే పైకి తెస్తాడే పిచ్చ మొఖమా."

"నీ పిచ్చిమండ" అనుకుంది లోలోపల వీరమ్మ. మరెప్పుడూ పెదవి కదపలేదు ఈ విషయంలో, ఏడుకొండలు భార్య దగ్గర బీరాలు పోయినా కొడుక్కి ఫీజులకి డబ్బు పంపాలంటే పెటపెటలాడి పోయాడు. డబ్బుకావాలి. ఎలా! ఎవరిస్తారు? తాకట్టు పెట్టటానికైనా పనికొచ్చే

సొమునులేదు. తలదాచుకునే పూరిపాక తాతలనాడే తాకట్టులో వుండి పోయింది. దానిమీద వడ్డీ పాపం పెరిగినట్టు పెరుగుతోంది. ఇలాంటి విషమ అవస్తలో గుర్తుకు వచ్చాడు షావుకారు పెంచలయ్య. అసలు ఏడు కొండలకి అప్పు అంటే చచ్చేంత భయం పెంచలయ్య దగ్గర అప్పు తీసుకొన్న కొన్ని కుటుంబాలు ఏ స్థితికి వెళ్ళాయో తెల్సినా అవసరం ఆయన దగ్గరికి నడిపిస్తోంది పెంచలయ్యలో ఒకే ఒక మంచిగుణం వుంది. "తాకట్టుకి వస్తువులు అక్కర్లేదు. మనిషి చాలు. మాటచాలు. నా డబ్బు యెక్కడికి పోతుంది" అంటాడు. యిలాంటప్పుడు పెంచలయ్య దేవుడి అవతారంలా అన్పిస్తాడు.

"అంతే ఆయస కబంధ హస్తాల్లో యిరుక్కుపోతారు అమాయకు లైన ఆ వూరి ప్రజలు. యింక ఆయన మాటకి యెదురు చెప్పగల దైర్యాన్ని గోల్పోతారు. కీలుబొమ్మలులా అయిపోతారు. అలాంటి పరిస్థితి కల్పిస్తాడాయన. యిదంతా జగమెరిగిన రహస్యమే అయినా పేదరికం, ఆకలిబాధా యీ అవసరాలు మనుషులకి ఆయన్నుంచి దూరంగా బ్రతక నీయవు. యిన్ని తెల్సి ఏడుకొండలు పెంచలయ్య దగ్గరకి బయలుదేరాడు. దారిలో ధర్మయ్య మాష్టారు యెదురుపడ్డారు.

"ఎక్కడికి ఏడుకొండలూ ఎండలో" అడిగారు ఆయన.

ఏడుకొండలిని ధర్మయ్యగాం దగ్గర దాపరికం లేదు. అందుకే విషయం క్లుప్తంగా చెప్పాడు. అంతా విన్న ధర్మయ్య ఏడుకొండలుని చెయ్యిపట్టుకుని వెనిక్కి తీసుకుని వచ్చేస్తూ-

"ఏడుకొండలూ పెంచలయ్య నీ మంచితనం చూసే అప్పిస్తాడన్న నమ్మకం నీకుందా" సూటిగా అడిగాడు.

"లేదు. కానీ నాకిప్పుడు డబ్బు అవసరంవుంది. అదెక్కడా దొరక్క...."

"నిజమే, కానీ అప్పుయిచ్చి తర్వాత పెంచలయ్య ఏం కావాలని అడిగినా నువ్వు యివ్వటానికి సిద్దంగా వున్నావా"

"అంటే?"

"యింకా నీకు అర్థంకాలేదూ! వాడు యీవూరికే చీడపురుగు, వాడు నీలాంటి ఎందరికో అప్పిచ్చి ఏం అడిగాడో తెల్సునా ఆడ పిల్లలని తన దగ్గరకి పంపాలంటాడు. మగ పిల్లలనైతే వాళ్ళ జీవితాలనే తాకట్టు వుంచుకుంటాడు తెల్సునా! యిలాంటివి నువ్వు సహించగలవా!"

'పంతులుగారూ!' ఏడుకొండలు ఆవేశంతో వూగిపోయాడు

"మీరన్న మాటలు ఎవరన్నా అంటే డొక్కచించి డోలు కట్టేస్తాను."

"వూఁ ఎందుకు అనవసర ఆవేశం వాడు అలాంటి పనులు యెన్ని చేయలేదు. యిదివరకుచేశాడు, చేస్తున్నాడు, ముందు చేస్తూనే వుంటాడు."

ఛీ అయితే అప్పుకెళ్ళను. పోనీయండి చదువు మానేసిరారా అని పుత్తరం రాసేస్తాను" ఏడుకొండలకి ఆవేశం యింకా తగ్గలేదు.

అది అసలు మంచిపనికాదు. చూడు యిన్నాళ్ళ నీ కష్టమూ వ్యర్థంకాదూ ? నాకు నిన్ననే మనియార్డరు వచ్చింది చిన్నబ్బాయినించి. అది ఇస్తా. ముందు అవసరానికి వాడుకో. పదమాయింటికి."

"మరి నేనిప్పుడే బాకీ తీర్చలేనుగా, మీరీనెలంతా వస్తుంటారా!

"ఫర్లేదు, అన్నింటికీ పైన దేవుడే వున్నాడు." అప్పటికి ధర్మయ్య డబ్బు సర్దారు.

కొడుకు పరీక్షలు తెల్సుకుని యింటికి వస్తూన్న ఏడుకొండలికి తను పడిన బాధలు అన్నీ ఒక్కసారి గుర్తుకు వస్తున్నాయి. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇంటికి వచ్చి ధర్మయ్యగార్ని చూస్తూనే బండి ఆపి అమాంతం వచ్చి ఆయన రెండు చేతులూ పట్టుకున్నాడు.

"పంతులుగారూ యిదంతా మీ చలవే నాకు దిక్కుతోచనప్పుడు

సలహాలేకాక డబ్బు కూడా యిచ్చి సాయపడ్డ మీ ఋణం నే నీ జన్మకు తీర్చుకోలేను. మా జగన్నాథం చిన్నప్పుడు అల్లరి చిల్లరిగా తిరిగి ఆకతాయి వేషాలు వేస్తూంటే మీ దగ్గరకి తీసుకొచ్చి దింపాను. మీదే భారం అన్నాను. వాడిని మీరు ఎట్టామార్చారో నాకు తెలియదు. వాడో మనిషి అయి చదువు పూర్తిచేయటం కాక ఫస్టుక్లాసే తెచ్చాడు. యిందుకు గర్వపడాల్సింది తండ్రిగా నేనుకాదు. గురువుగా మీరు." ఏడుకొండల గొంతు బొంగురు పోయింది.

"ఆ....ఆ....నన్ను ములగచెట్టు ఎక్కించకయ్యా" ధర్మయ్య కళ్ళలో పిసరంత గర్వం తళుకుమంది.

"జగన్నాథం అక్కరకొచ్చే కొమ్మ. కనుకనే శలవుల్లో కూడా యింటికి రాకుండా బస్తీలోనే వుండి, బట్టలకొట్టుల్లో పద్దులు రాస్తూ వాడి పొట్ట వాడు పోసుకుంటూ మీకు బరువు తగ్గిస్తున్నాడు."

నిజమే. వాడినోసారి వెంటనే రమ్మని వుత్తరం రాస్తాను పంతులు గారూ."

"రాయి. ఓసారి చూడాలని వుంది. అది సరే పరీక్షలముందేదో బ్యాంక్ పరీక్షరాశాడు. అదేమన్నా తెల్సిందా."

"లేదు యింకా! దేవుడి దయవల్ల అదేగనక వస్తే."

"అదేవస్తుందిగానీ నువ్వు ధైర్యంగా వుండు. చెల్లెమ్మా. యింక శే వస్తానమ్మా."

పంతులుగారు లేచారు. "అన్నట్లు పెంచలయ్య కొడుకుకూడా యీ పరీక్ష రాసినట్లున్నాడు. ఏమైందో! వాడే ప్యాసైవుంటే యీపాటికి వూళ్ళో బాణాసంచా కాల్చిపారేసేవాళ్ళే....ధర్మయ్య యింటిముఖం పట్టారు.

ఏడుకొండలకి యేనుగెక్కినంత సంతోషంగా వుంది. భార్యదగ్గరగా వచ్చి మీసం మీద చెయ్యివేసి బిగ్గరగా నవ్వాడు.

"అహో గొప్ప, నువ్వే ప్యాసైనట్లు గొప్పపోతున్నావే."

"నా కొడుకు వేరు, నేను వేరు టే పిచ్చి ముఖమా పైకి పొక్కటం లేదు.గానీ లోపల నీకు మాత్రం సంబరంగా లేదు."

వీరమ్మ వక్కుమంది. భార్య ముఖంలో యింత నవ్వు యెన్నో సంవత్సరాల తర్వాత చూశాడు ఏడుకొండలు.

"అమ్మా పరమాన్నం చెయ్యవే. పండక్కికూడా చేయలా" చిన్నా దీర్ఘం తీశాడు తల్లి కొంగుపట్టుకుని.

"ఏంపెట్టి చెయ్యనురా!" కసురుకుంది వీరమ్మ కొడుకుని.

"వుండహె క్షణంలో సోడాసీసాలమ్మి పరమాన్నంకి కావల్సినవి తెస్తానుండు."

ఏడుకొండలు తేలిక చిరుగుల తువ్వాలు చుట్టుకుని ఆ యెండలో కాళ్లు మాడుతున్నా బండి తీసుకుని బయలుదేరాడు. సోడా! సోడా! అంటూన్న మొగుడికేకలు చెవులకి విన్పిస్తూన్నాయి కానీ కొడుకు పెద్ద వుద్యోగస్తుడు అయిపోయినట్లుగా కలలు కంటూ సూదిమాట మర్చిపోయింది వీరమ్మ. అది చేతిలో గుచ్చుకుని రక్తం చిమ్ముతూంటే 'అబ్బా' అనుకుని చప్పున చెయ్యిచూసుకుంది.

## 2

పెంచలయ్య పెదవి కదపకుండానే అగ్ని కురిపిస్తున్నట్లు చూస్తున్నాడు సహచరులవైపు. వాళ్ళకి అలవాటే అయినా యెప్పటికప్పుడు హడిలి చస్తుంటారు షావుకారు కోపానికి. ఈయనకి యిప్పుడు యింత కోపం ఎందుకు వచ్చిందో వాళ్ళకి తెల్సు.

ఎకరం పొలంఅన్నా లేని ఏడుకొండలు కొడుకు షావుకారు పెంచలయ్య కొడుకు బియస్సీ తప్పితే తను మాత్రం తగుదునమ్మా అన్నట్లు ఫస్టుక్లాసులో పాస్అయి అవమానం తెస్తాడా? యిదీ పెంచలయ్య

వుద్దేశ్యం. దాన్ని సమర్థిస్తున్నారు షావుకారు సహచరులైన పూజారి పిచ్చయ్యా, గోవిందం సుబ్బారావూ వగైరా.

"వీడు పిల్లాడు కాడు పిడుగులా ఉన్నాడే."

"అప్పుడే ఏంచూశావు. యింకా మన చిన్నబ్బాయిగారి మీద పోటీగా ఎన్ని చేస్తాడో?"

యిలా అంటున్నారు తాళగాళ్ళు.

"యిప్పుడేంచేసి ఏడిచారు." అన్నట్లు చూశాడు పెంచలయ్యా.

మీరు వూ అనండి ఏడుకొండలు కొడుకుని పత్తా తెలియకుండా పాతి పెట్టేస్తా" సుబ్బారావు మీసం మెలేసాడు.

"ఆడు ఈ వూరోస్తేగా, నువ్వు గనుక పట్నం ఎళ్ళావంటే నిన్నే పాతేస్తారు పోలీసులు" గోవిందం మందలించాడు.

"వూ" పెంచలయ్య కనుబొమ్మలు చిట్లించి అన్నాడు.

అనవసర ప్రసంగం కట్టిపెట్టి పకడ్ బందీగా ప్లాను వెయ్యండి". చూడండి ఈ వూళ్ళో నా చేతికి చిక్కకుండా ఆ ఏడుకొండలుగాడే పరువు తీశాడు. వాడి కొడుకు నా కొడుకు తలెత్తకుండా చేశాడు యిది నేను సహించలేను. కాఫీ తాగివస్తా" అంటూ లోపలికి వెళ్ళాడు.

యింక ముగ్గురూ గుసగుసలు మొదలు పెట్టారు.

"సుబ్బన్నా అర్ధాకలితో అన్నంతిని నీళ్ళుతాగి కడుపునింపుకుని రోడ్డులైటు దగ్గర కూచుని చదువు సాగించిన ఆ జగన్నాధం వెధవగాడికి క్లాసుయెట్టా గొచ్చిందంటావు."

"అదే అర్థం అయి చావటంలా'' బుర్ర గోకున్నాడు అప్పారావు.

"మన పెంచలయ్య కొడుక్కి చదువొస్తుందన్న ప్రతిమందూ కొని మింగించారు. యింజీషన్లు యిప్పించారు. టానిక్కులు గుప్పించారు. అవన్నీ యేగోతిలో కలిసినాయంటావూ?

"ఆ చిన్న షావుకారికి అసలు చదువంటే శ్రద్ధ యెప్పుడేడిసిం దింటావూ? గురువన్నా గౌరవంలేదు. తండ్రి అంటే భయంలేదు. అమ్మా చెల్లెలు అంటే ఆపేక్షలేదు. పేదోళ్ళంటే జాలిలేదు. యెప్పుడు చూసినా డబ్బు డబ్బుఅంటా పుత్తరాలు రాయడం తప్ప. తండ్రి పంపేదంతా అక్కడ యేగోతిలో పోస్తున్నాడో యిక్కడీయన పేదోళ్ళ పొట్టలు కొట్టి ఇనప్పెట్టెలు నింపుకోవడం అదట్టా పాడుచేయటం.

అయినా వీళ్ళ అధికారం మంట ఈ ఊళ్ళో ఏ కుర్రవెధవా పెద్ద చదువు చదవకూడదు. వాళ్ళబ్బాయితో సమానం కాకూడదు. ఇదేం ఏడుపంటా!"

"అదంతే? యిన్నాళ్ళు జరగలా! ఇకముందూ అంతే."

"ఆ యిన్నాళ్ళూ జరగడం వేరుగానీ యికముందు జరగటం కల్ల. మనతరం వాళ్ళం అంటే యీయన దగ్గర అప్పు తీసుకున్న అప రాధానికి యీయన. తాకట్టుపడ్డాం. అన్నింటికీ తలవంచాం. కానీ మన కుర్రాళ్ళకి అక్షరంముక్క వద్దని నాగళ్ళు వప్పగించినా వాళ్ళు తెలివి మీరి పోయి ఎదురు తిరుగుతున్నారు." భయంగా అన్నాడు పూజారి.

"ఆ పిల్లకాకులు వాళ్ళేంచేయగలరు. పెంచలయ్యేదే యీ వూళ్ళో మేడ ఆయన కొడుకే కొడుకు.... యిందుకు భిన్నంగా జరిగిందా ఆయన సహించలేడు. వాళ్ళ కుటుంబం అంతా కుళ్ళు కుంటుంది. యీకుళ్ళకి కారణం అయిన వాడికి కాలం మూడిందన్నమాటే."

"హుష్! గోడకి చెవులుంటాయి. బిగ్గరగా మాట్లాడకు."

"ఆ! యిక్కడ యెన్ని ఆలోచనలు జరగలేదు! అర్ధర్ల జారీకాలేదు. అక్షరాలా ఆపని జరిగిపోయినా ఏ మానవుడికన్నా ఆచూకీ దొరికిందా"

"నిజమేలే! అన్నట్లుఅదిగో దొడ్డి అరుగుమీద దేవుడు చద్దికూడు తింటున్నాడు! వినగలడు."

"ఆ · ఆడోదున్నబోతు. మనిషి రూపంలో పుట్టాడేగానీ చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోలేదు. పిచ్చిసన్నాసి. వీడిఅమ్మ వీడికి దేవుడని పేరెట్టి అయిదేళ్ళుపెంచి మూడురూపాయిలకి పెంచలయ్యకి అమ్మేసింది కడుపు నింపుకునేందుకు."

"అసలు దేవుడి తల్లితండ్రీ అందరూ పెంచలయ్యకి శక్తి ధారపోస్తూనేగా బతుకులు చాలించుకుంది? అన్నట్లు యీ దేవుడిగాడి నాన్నని నువ్వేగా సఫాజేసిందీ!"

"ఎప్పటి మాటోగా" మీసంమెలేస్తూ యికిలించాడు గోవిందు.

పెంచలయ్య కొడుక్కి అప్పుడే నెత్తిన నాలుగు పరకలువెంట్రుకలు లేవు గానీ యీ దేవుడిగాడికి ముఖంబాగులేకున్నా క్రాపుమాత్రం అందంగా ఉంటుంది సచ్చివాడికి."

"యిది చూసి కంట్లో కారం పడ్డట్లు సావుకారు కొడుకు శలవులకి వొచ్చి నప్పుడల్లా మంగలిని పిలిపించి దేవుడిగాడికిగుండుకొట్టించిగానీ శాంతిపడడు. దేవుడిగాడి గుండు నున్నగామెరస్తోంది కదట్రా."

అందరూ పెద్దగా నవ్వారు. దేవుడు ఇరవైయేళ్ళవాడు నల్లటి శరీరం పొట్టిగా కాస్త లావుగా, బలంగా వుంటాడు. నిరాకారి ముతకపంచె చేతులున్న ముతక బనీను మెడలో ఎర్రదారంతో కట్టిన వెండితాయెత్తు యిదీదేవుడిరూపం దేవుడికియిప్పుడునా అన్నవాళ్ళులేరు. పెంచలయ్య యింట్లో గాడిద చాకిరీ అంతా చేయటమే వాడికి తెల్సు. కుక్కముట్టుకున్న అన్నంపెట్టినాఆవురావుమంటూతినడం తెల్సు ఎర్రచీమలు అన్నం నిండా వున్నా ఓపిగ్గా కూచుని ఏరుకుని కొరివిరభాంతోనంచుకునితినడంతెల్సు. 'యిది నాకొద్దు" అనటం వాడికి తెలియదు. యింట్లో పనేకాక పొలంపని అంతా చేసినా అలసట అనేది వాడికి తెలియదు. యీ రోజూ అలా అన్నం తింటూ నోరుమండి "మంచినీళ్ళోయ్ అప్పమ్మా" అన్నాడు. వంటామె విన్పించుకోలేదు.

దేవుడు మళ్ళీ అడగలేదు. ఎంతో అవసరం అయితేగానీ పెదవి కదపని దేవుడు నవ్వగా ఇంతవరకూ ఎవ్వరూ చూడలేదు అనుకుంటూ వుంటారు. ఆ వూరివాళ్ళు. అయితే కళ్ళతోమాత్రం తనచుట్టూ ఏం జరుగుతోందో చూస్తూ వుంటాడు అంతే దేవుడు మనిషి రూపంలో వున్నా ఒట్టి పిచ్చివెధవ అనుకుంటారు అందరూ. వాడికి ఆలోచనేలేదు. యంత్రంలా పని చేయటం తప్ప అనీ అనుకుంటారు.

"పెంచలయ్యా ఒక్కడూ లోపలికి వెళ్లి కాఫీ తాగకపోతే మనం దరిమొఖానకూడా ఓ చుక్కపోస్తే యేం" పూజారి యిలాఅనేసరికి మిగతా వాళ్ళు దేవుడి గుండుమీదనించి దృష్టి యిటు మరల్చారు.

అంత తెగింపువుంటే యింత యిల్లూ పొలం డబ్బూ యెట్టా గొస్తుందీ!"

"ఆ ధర్మయ్యా పంతుల్లా యిల్లూ పొలం కొడుకులకి పంచి వూరు చివర దిక్కులేనివాడిలా ఒక నిట్టాడిపాకలేసుకునే గతి పడుతుంది."

"ఆయన పూలమ్మిన వూళ్ళోనే కట్టెలమ్ముతున్నాడు. కొడుకులు కృతఘ్నులు. ఆస్తులు పంచిన తర్వాత తండ్రి వున్నాడన్నమాట మరిచి వాళ్ళస్వార్థం వాళ్ల చూసుకుంటూన్నారు ఇన్ని జరిగినా ఆయన పెదవి విప్పి ఒక్కపలుకు పలక్కుండా అంతా దేవుడిదయ అని నలుగురు పిల్లలకి చదువుచెప్పుకుంటూ పొట్ట పోసుకుంటున్నాడు."

"ఆయన చదువుచెప్పే పిల్లలలో సగం మంది డబ్బిచ్చుకోలేనివాళ్లే."

"అవునూ ఈ దేవుడుగాడి మధ్యన ఆ ధర్మయ్యగారి దగ్గరకెళ్ళి కూచుంటూన్నట్టున్నాడుట."

'పాపం దేవుడిగాడి తల్లినీ అక్కనీ కూడా యీ పెంచలయ్యేగారే నాశనం జేసిండీ! వాళ్లు లబోమన్నా యిదేం అన్యాయం అని అడిగిన మగాడు లేకపోయా డీ వూళ్ళో.'

ఓరేయ్. నీకియాళ యిదేం పొయేకాలం ఒచ్చిందిరా బతకాలని లేదా! నువు కూచుంది పెంచలయ్య యిల్లని మరచిపోయావా!'

'ఒరే... నోరుముయ్యండి. గోడకి చెవులుంటాయి.'

గోడకీ చెవులున్నా పెంచలయ్యకి చెముడుందిగా. ఈమాటలు యిన లేడు'

దొంగచెముడు కాదుకందా!'

'కాదులే అడిగో గున్నయేనుగులా డజను యిడ్లీలూ సేరు కాఫీ తాగి శరీరం తెగపెంచుకుని వస్తూన్నాడు.'

సుబ్బారావు 'హుష్' అన్నట్లు చూశాడు. అందరూ గప్‌చిప్ అయి పోయారు. పెంచలయ్య బ్రేవ్ అంటూ తేవుతూ వచ్చి కుర్చీలో కూర్చు న్నాడు. అందరి ముఖాల్లోకీ ఓసారి చూశాడు. ఏదైనా ఆలోచించారా! అన్న అర్థంతో.

'మీరే ఆర్డరు పారేయండి. స్వామి కార్యం క్షణాలమీద చేసుకొచ్చే మేం వుండగా మీకు దిగులెందుకూ!' గోవిందు కాస్త దగ్గరకిజరిగి అడిగాడు.

పెంచలయ్యకి క్షణంకోపంవచ్చింది అయినా దాన్ని బహిర్గతం చేయడు. ప్రత్యక్షంగా యెవరితోనూ యెప్పుడూ తగూకి దిగటం యెవ్వరూ యెరుగరు.

పెంచలయ్య ముఖంయెదుట ధర్మ ప్రభువు అని వినయంనటించి చాటున దొంగవెధవ, తడిగుడ్డలతో గొంతులు కోసే నక్క.' అను కుంటారు.

"యిదిగో నాక్కావల్సింది మాటలు కాదు" అన్నట్లు చూస్తున్నాడు పెంచలయ్య.

"ఆ జగన్నాథం యెదవ యీ పూరొస్తే బాగుండు. ఏ కీలు కాకీలు యిరగొట్టి పారేద్దును" అప్పారావు మీసం మెలేశాడు.

పెంచలయ్య అప్పారావుని దగ్గరకి రమ్మని పిలిచాడు. సమాలోచన చేస్తున్నాడు. "ఏడుకొండలు కొడుక్కి రమ్మని వుత్తరంరాశారు. రేపొస్తా డంట పూజారి బయటపెట్టాడు. పెంచలయ్య యెగిరి గంతేశాడు.

"చూడూ జగన్నాధాన్ని పిలిచి కాఫీ యిద్దాం. ఆ తర్వాత.... అప్పారావు పని అప్పారావు చేసేస్తాడు.

అందరూ భయంగా చూశారు పెంచలయ్య ముఖంలోకి.

'మనింట్లో కాదులే భయపడకండి. సరే యింకపొండి. అంటూ లేచాడు.

అప్పారావూ గోవిందూ చెయ్యిచాచారు. పెంచలయ్య భారీచెయ్యి యిలాంటప్పుడే బైటపెడతాడు అని వాళ్ళకి బాగాతెల్సు. అందరూ బైటకి వెళ్ళిపోతూంటే అన్నం తినటం మానేసిన దేవుడు కళ్ళు యింతచేసుకుని యిదంతా చూస్తున్నాడు. యిదచూసిన పెంచలయ్య పెద్దకేక పెట్టాడు.

'ఏరా దున్నపోతా యింకా నీతిండి రాలా!' దేవుడు వులిక్కిపడ్డాడు. చకచకా చెయికడిగి లేచి పశువులని తోలుకుని పొలం బయలుదేరాడు.

## 3

దేవుడు పొలంపోతూ ప్రతిరోజూ వూరిమధ్య కొత్తగా ప్రతిష్టించిన గాంధీగారి శిలావిగ్రహం దగ్గర కాస్సేపు ఆగుతాడు. కొత్తగా యీ బొమ్మని చూసి కర్రపట్టుకున్నాడు కనుక తనలానే యీయనా పాలేరు కావచ్చు అనుకున్నాడు. అందరూ యీ బొమ్మకి దణ్ణంపెట్టి పూలదండలు వేస్తూంటే ఆశ్చర్యపోయి తన సందేహాన్ని ధర్మయ్య పంతులుముందు వుంచాడు. ధర్మయ్యగాంధీగారినిగురించిక్లుప్తంగా చెప్పాడు. దేవుడికి అర్థమయి కాక వేసేచచ్చు ప్రశ్నల కన్నింటికీ వోపిగ్గా సమాధానాలు యిచ్చారు చివరికి అన్నారు, ఆయన మనుషుల్లో దేవుడు అనేసరికి కొండంత సంబరంకలిగింది దేవుడికి.

'నాపేరూ యీ ముసలాయనపేరూ ఒకటేగా పొంతులుగోరూ' అన్నాము. ధర్మయ్య క్షణం నివ్వెరపోయి ఆ తర్వాత 'అవును' అన్నట్లు చిరునవ్వు నవ్వారు.

దేవుడికి గాంధీగారంటే అభిమానం యెక్కువై పోయింది. ప్రతి రోజూ యెవరూ చూడకుండా ఒకపువ్వుకోసుకొచ్చి గాంధీగారి పాదాల దగ్గరపెట్టి మళ్ళీ గేదలని తోలుకుని వెళ్ళిపొతాడు ఒకరోజు పంతులుగారు దేవుడికి గాంధీ గారి మూడు కోతుల కథ చెప్పారు. దేవుడు అంతా శ్రద్ధగా వింటూ ఆలోచిస్తూన్నాడు. దేవుడిలో కొత్తకొత్త ఆలోచనలు మొదలయ్యాయి. అవి వాడిని కుళ్ళబోస్తూన్నాయి. పంతులుగారి మాటలకి అడ్డంవస్తు అన్నాడు.

'పంతులుగారూ చెడు యినకు. పలక్కు, చూడకుఅన్నారు. బాగుంది. కానీ, చెడ్డపని యే యెదవన్నా చేస్తావుంటే చేతకాని వాజమ్మలా కళ్లూనోరూ మూసుకు కూకోవాలా! యిది నాకు నచ్చలా, అన్నాడు గట్టిగా. యిదినే ఒప్పనుగాక ఒప్పను అన్నాడు మళ్ళీ ఆవేశంగా.

'అలా కూచోమని బాపూ చెప్పలేదు గానీ ఒకవేళ యెవరన్నా చెడుచెస్తే నువ్వేం చేస్తావు దేవుడూ!' కుతూహలంగా అన్నారు పంతులు గారు.

'పాతేస్తాను' పళ్లుకొరుకుతూ అన్నాడు.

'ఆవేశపడకు,' అంటూ యింకా అవీ యివీ చెప్పి ఆఖరున అన్నారు.

'బాపూ మంచితనమే ఆయన్ని కబళించివేసింది.'

'అంటే'

'ఆయన్ని కాల్చి చంపేశారు.'

దేవుడు ఫులిక్కి పడ్డాడు. 'మన పెంచలయ్యేనా' ఆతురతగా అడిగాడు,

'కాదుగానీ అది మరోసారి చెప్తాలే పొద్దుపోయింది యింటికిపో' అనటంతో దేవుడు యింటిముఖం పట్టాడు.

# 4

ఎడుకొండలు కొడుకు వచ్చాడు. పెంచలయ్య అతన్నిఅభినందించీ కాఫీ ఇచ్చిపంపాడు. బస్తీలోపనుంది, రాత్రికి వస్తానని చెప్పి బయలు దేరుతూన్న తండ్రితో కొడుకు నేనూ వస్తానని బయలుదేరాడు.

'యిప్పుడు నువ్వెందుకు, రేపొద్దువులే' అనేసి పెంచలయ్య వెళ్ళి పోయాడు.

సాయంకాలం యింక పల్లెలో కాలునిలవక తల్లిని పప్పించి బస్తీ బయలు దేరాడు పెంచలయ్య కొడుకు. దేవుడు సచ్చినాడు పశువులని యింట్లోకి తోలియెటుపొయాడో యింకా యింటికి చావలా' వంటామె విసు క్కుంటోంది.

ఈ పల్లెకి మైలున్నర నడిస్తే బస్ యెక్కవచ్చు, రెండుమైళు నడిస్తే రైలు యెక్కి పట్నంచేరవచ్చు. అయితే ఊళ్ళోఅందరూ దగ్గరని బస్సుకే వెడుతూంటారు.

రాత్రి గడిచింది. తెలతెలవారు తూండగా ఊరంతా గోలగోల అయింది.

పెంచలయ్య కొడుకుని చావబాది కుడిచెయ్యి విరక్కొట్టి సారి పోయారుట' అన్నవిషయం అందరికీతెల్సిపోయింది. 'యిదెలా జరిగింది.' యెందుకు జరిగింది.' అన్న ఆశ్చర్యమే అందరికీ యింక పెంచలయ్య నిప్పులు కక్కుతున్నాడు. ఎవరు చేశారీ కుట్ర. మన ప్లాను యెవరికి తెల్సింది. యెలాతెల్సింది యెవరిలా చెప్పినా వేలితో నాకంట్లోనే పొడిచారు. యిది జరుగుతూంటే మీరంతా ఏం చేస్తున్నారు చెప్పండి. చెప్పండి' హూంకరిస్తున్నాడు. యింటి లోపల పెంచలయ్యభార్య గోలుగోలున

యేడుస్తోంది. పెంచలయ్య మండిపడుతున్నాడు. పూజారి భయంభయంగా
దగ్గరకొచ్చి చెవిలోగుసగుసగాచెప్పాడు ఏదో.

'ఆ ' పెంచలయ్య కళ్ళు తుమ్మ నిప్పుల్లా అయాయి. గోడకున్న
హంటర్ తీసుకుని పెరట్లో సర్తుగిన్నెలో చీమలని దులుపేకుంటూ చద్దెన్నం
తింటూన్న దేవుడి దగ్గరకు వచ్చాడు. చళ్న కొట్టాడు. దేవుడు తన
ఆలోచనలో తనుండి పెంచలయ్యనిగమనించలేదు కానీ చొక్కాలేని ఒంటి
మీద ఛెళ్ మని హంటర్‌పడి చర్మం లేచిపోయేసరికి వులిక్కిపడి ఈలోకంలోకి
వచ్చాడు. 'అబ్బా!' అని గావుకేక పెట్టాడు. యెదుట వున్న పెంచలయ్యని
చూశాడు కళ్ళప్పగించి ఒక్కనిమిషం మాత్రమే అప్పటికే ఛళ్ ఛళ్ మని
చాలాదెబ్బలు పడిపోతూన్నాయి. దేవుడు లేదాడు! వాడికళ్ళు యెర్ర
బడ్డాయి.

గుండెమండింది. చర్మంలేచినవీపూ మండింది. పెంచలయ్య బండ
బూతులు తిడుతూదేవుడిని బాదుతూనే వున్నాడు. దేవుడు ఒక్కసారి తిరగ
బడి యజమాని చేతిలోనిహంటర్ ఒక్క గుంజుగుంజాడు. పెంచలయ్య
బోర్లాపడ్డాడు. హంటర్ దేవుడి చేతిలోకి వచ్చేసింది అంతే దేవుడు ఛెళ్
మని వేశాడు. పెంచలయ్య హిహో కారాలకి అతని బంటులు ముందుకు
రాబోయారు. కానీ దేవుడి విశ్వరూపం చూసి హడలి అక్కడే నిల్చిపోయారు
వణుకుతూ. పెంచలయ్య తన వాళ్లు సాయంరాలేదన్న యదార్థం తెల్సుకుని
కుప్పలా కూలిపోయి ఒక్కకేక పెట్టాడు. దేవుడు మళ్ళీ హంటర్ యెత్తాడు.
పెంచలయ్య మృత్యుభయంతో ఒక్క గావుకేక పెట్టాడు. కళ్ళు విటకరిం
చాడు. ఆ ముఖాన్ని ఆయన పిరికి తనాన్ని చూసి దేవుడు నవ్వాడు. బిగ్గ
రగా నవ్వాడు. విరగబడి నవ్వాడు.

పెంచలయ్యా.... సూడూ .. యిది నీచేతిలోంచి నా చేతికొచ్చింది.
జాగర్త అంటూ విసవిసా ఆయిల్లు వదలి సరాసరి పంతులుగారి దగ్గరకి
వస్తూ గాంధీగారి శిలావిగ్రహందగ్గర క్షణం ఆగాడు. అప్పటికే ధర్మయ్య
గారికీ విషయం తెల్సింది. దేవుడు రాత్రి ఏడుకొండలు కొడుకుని బస్
దగ్గరకికాక ద్యూమైనా రైలెక్కించి క్షేమంగా వూరు దాటించి వచ్చాడని

పెంచలయ్యా మనుషులు తెగ తాగిన నిషాలో షావుకారు కొడుకే ఏడుకొండలు కొడుకని తమకి అప్పగించిన పని పూర్తిచేసి ఇంటికెళ్ళిపోయి హాయిగా నిద్రపోయారనీ తెల్లవారిగాగీ యదార్థం తెల్సుకోలేదనీ ఇదంతా తెల్సి పంతులుగారు ఆతురతగా పరుగున వచ్చారు పంతులుగార్ని చూడగానే దేవుడు చేతిలోని హంటరు విసిరేశాడు, చేతులు జోడించాడు.

"పంతులుగారూ నా మనసు సెప్పిన నాయం సేశాను అందుకు పెంచలయ్యా నాకి బవుమానం యిచ్చాడు. దెబ్బతినటం అలవాటుగానీ యీయాల తిరగబడ్డాను. పాపం పెంచలయ్యాని సంపేస్తానని బయపడిపోయాడు సీ ... అపని నేసస్తే సేయను అవిసరేగానీ యిప్పుడు సెప్పండి. నే ఎట్టాబతకను నా కన్నం యెవరెడతారు. నా ఆకలి యెవరు తీరుత్తారు"

పంతులుగారినోట ఇంకా మాట రాలేదు. ఆ వూళ్ళోని యువకులు అందరూ పరుగున వచ్చారు. దేవుడి మాటలు విన్నారు.

"దేవుడూ నువ్వునిజంగా దేవుడివేరా. లేకుంటే ఏడుకొండల ఆశాజ్యోతి యిప్పటికి ఆరిపోయి వుండేది. జగన్నాధాన్ని రైలెక్కించి సురక్షితంగాపంపి నువ్వా పెంచలయ్యా కిరాతకానికి వళ్ళప్పగించావా! ఒరేయ్ దేవుడూ నువ్వురా అసలైనమనిషివి. ఒరేయ్ నీకు ఈవూరు పూరంతా అండగా నిలుస్తాదిరా, నిన్ను ఆకలితో చావనీయంరా. పెంచలయ్యా ఆటలు అందరంకల్సి కట్టించ్చేద్దాంరా. భయపడకు" అని ధైర్యం చెప్తూన్నా ఏడుకొండలు "దేవుడూ!" అంటూ వచ్చి అమాంతం వాటేసుకుని వాడికి తగిలిన దెబ్బలనీ వాటినించి కారే రక్తాన్ని చూస్తూ "అబ్బా!" అని కళ్ళు మూసుకున్నాడు. ధర్మయ్యా దేవుడిని చూస్తూంటే కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతూన్నాయి. వూరు వూరంతా యేకమై తనదగ్గరకి వచ్చేసరికి దేవుడికి మళ్ళ నవ్వొచ్చింది.

(స్వాతి మాస పత్రిక)